~~Roll No. 1054~~

ఆంధ్ర సచిత్ర వారపత్రిక
[illegible]
మార్చి 1943 సంచిక

భారతి 1943 మార్చి.

ఇంగ్లీషునాగరికత - దాని ప్రభావము

= శ్రీ దిగవల్లి వెంకటశివరావు =

భారతదేశం రాజకీయంగా స్వాతంత్ర్యాన్ని గోల్పోయి బ్రిటీషువారి అధికారానికి లోబడగా ఒక విజాతీయనాగరికతయొక్క ప్రభావానికి కూడా అది లోనైంది. దేశాన్ని పరిపాలించే పురాతన రాజ్యాంగపద్ధతులు విచ్ఛిన్నంకాగా ఈ దేశంయొక్క పురాతనసభ్యతయందుకూడా ప్రజలకు నమ్మకం పోయింది. ఈ దేశాన్ని జయించిన భీమబలులైన ఈ విదేశీయుల ఆధిక్యతముందర మనము ఎంతో అల్పజ్ఞుల మనే భావం ప్రబలింది. బ్రిటీషువారి ప్రాబల్యముతో పాటు ఈ దేశంలోనికి పాశ్చాత్యభావాలూ, ఆశయాలూ రావడమే తరవాయిగా మన సభ్యతయొక్క పునాదులు పూర్తిగా కదిలిపోయినాయి.

ఈ కొత్త హయాములో ప్రజలకు ఇంగ్లీషు రుచులూ, భావాలూ బలపరచి వారిని ఆంగ్లమానస పుత్రులుగా చేయాలనే వుద్దేశ్యంతో ప్రారంభింపబడిన ఇంగ్లీషువిద్యావిధానము ప్రజల ఆధ్యాత్మికధర్మాలకే వేరుపురుగుగా పరిణమించింది. ఈ కొత్త పరిస్థితులలో చదువుకునేవారికి నిజదేశ వేషభాషలపైన అభిమానము, గౌరవమూ పోయి తమకు నిజంగా ఒక ప్రాచీన సభ్యత అనేదే లేదనిన్నీ, తమ పూర్వులందరూ తెలివితక్కువదారులలో పడి మూఢులైపోయినవారనిన్నీ, తమ దేశం బాగుపడాలంటే పాతదారులన్నీ కట్టిపెట్టి, కేవలం పాశ్చాత్యనాగరికత చూపే మార్గాలనే అనుసరించాలనిన్నీ మొదలైన విపరీతబుద్ధులు అలవడ్డాయి.

ఇంగ్లీషుభావమూలాన దేశంలో అంతులేని నాస్తికత్వం వ్యాపించింది. కేవల నాస్తికులూ ప్రకృతిశాస్త్రజ్ఞులైన శుష్కవేదాంతులూ వ్రాసిన గ్రంథాలు, వారి భావాలు ప్రచారంలోకి వచ్చి హిందూధర్మచ్యుతికి దారిదీయడం ప్రారంభమైనది. వందలకొద్ది యువకులు ఈ కొత్త పద్ధతులలో దిగారు. నాస్తికవాదంలోనూ, అలాంటి జీవితవిధానంలోనూ మునిగిపోయారు. హిందూధర్మం తాళలేక విచ్ఛిన్నంకావడం మొదలు పెట్టింది.

భారతీయులు ఇలాగ పాశ్చాత్యసభ్యతయొక్క వ్యామోహానికి లోబడగా కొత్త విద్యావిధానానికి దగ్గరసంబంధం గల కొన్ని పాపిష్టిశక్తులు విజృంభించి ప్రజల దేశాచారాలకు భంగకరమైన దారులలోకి దింపినాయి. ఈ దెబ్బకు తట్టుకున్న వారి నింకొక బ్రహ్మాండమైన శక్తి ఎదుర్కొన్నది. ఈ దేశంలో ఇంగ్లీషు విద్యావిధానం ప్రారంభించడంతోపాటు క్రైస్తవ మతప్రచారం కూడా విజృంభించింది. ఈ క్రైస్తవ మతబోధకులు ఇంగ్లీషు నేర్పడంతోపాటు బైబిలు మతం కూడా బోధించే పనికి పూనుకున్నారు. ఈ మిషనరీలు మంచి తెలివైన బడిపంతుళ్లుగా వుండేవారు. అయితే క్రైస్తవమతప్రచారంపైన వారికి గల ఆసక్తి వల్ల వారు దేశీయుల మతాచారాలను సహించలేక పోయేవారు. ఇతరమతాలలో మంచిగాని, సత్యముగాని ఏ మాత్రమైనా వున్నదని వీ రంగీకరించకపోవ

డమేగాక సర్వకాలసర్వావస్థలయందును పరమతాలను దూషించడమే పనిగా పెట్టుకునేవారు.

మన దేశంయొక్క దురదృష్టవశాత్తూ ఈ మిషనరీలు విద్యాబోధకులుగానూ, పత్రికాధిపతులుగానూ, సంఘసేవకులుగానూ, పరోపకారులుగానూ, దేశపరిపాలకులైన దొరల జాతివారుగానూ వుండి నందువల్ల వీరికి స్థానబలమూ, అధికారబలమూ కూడా వుండి వీరిమాట చెల్లుబడి అవుతూవుండేది. మిషనరీలలో కొందరు నిజంగా ఈ దేశీయులపట్ల సానుభూతి, ప్రేమ కలవారుగా వుండేవారు. అందువల్ల వీరి ప్రభావము మరీ ఎక్కువగా వుండేది. విద్యాలయాల ద్వారములం దీ క్రైస్తవమతప్రచారకులు స్థావర మేర్పరచుకొని తమదగ్గర చదువుకునే యువకులను విద్యలో తర్ఫీదుచేస్తూ క్రైస్తవమతంలో కలుపుకోవడానికి దోహదం చేసేవారు.

ఇలాగ కొన్నాళ్లు జరిగేటప్పటికి విపరీతవిద్యాబుద్ధులు నేర్చిన సంకరజాతిసభ్యతలో పెరిగిన ఒక తరమువారు దేశములో అన్ని పక్కలా కుక్క గొడుగులలాగున బయలుదేరారు. వీళ్లు తమ రుచులలో, భావాలలో, మనఃప్రవృత్తిలో, జీవితపద్ధతిలో ఇంగ్లీషువాళ్లూ కారు. భారతీయులూ కారు. వీరికి తమ పూర్వులపైన, పూర్వనాగరికతపైన గౌరవమూ లేదు. తమ దేశానికి ఏలికలుగానూ, తమ విజ్ఞానానికి గురువులుగానూ అవతరించిన యింగ్లీషుయజమానులను అనుకరించడమే గొప్పదనం అనుకునేవారు. (*Article by Swami Nirvanananda on Sri Rama Krishna and his times. Cultural Heritage of India. vol. II. pp. 441-443.*)

వేషభాషలలో మార్పు

1823-26 మధ్య కలకత్తాలో కుంపినీవారి కొలువులో ప్రధానక్రైస్తవమతాచార్యుడుగా వుండిన బిషప్ హెబరుగారు ఇంగ్లీషువారి సంపర్కంవల్ల హిందూదేశంలో కలిగిన మార్పులనుగురించి ఇలాగ వ్రాశారు:

"ఇప్పటి హిందువుల లౌకికఆచారవ్యవహారాలలో సగంవంతు ఈ దేశాన్ని జయించిన మహమ్మదీయ ప్రభువులవల్ల సంక్రమించినవే అని తెలివైనవారు కొందరు నాకు స్పష్టంగా చెప్పారు. ఇప్పుడు అన్ని విషయాలలోనూ ఇంగ్లీషువారిని అనుకరించడం ప్రారంభమైనది. దీనివల్ల దేశంలో చాలా మార్పులు కలిగాయి. ఇంకా ముఖ్యమైన మార్పులు కలిగితీరతాయి. డబ్బుగల దేశీయులు తమ ఇళ్లకు అందంకోసం గ్రీసుదేశపు కొరింతియన్ స్తంభాలు కట్టిస్తున్నారు. దొరలు ఉపయోగించే కుర్చీలు, బల్లలు మొదలైన గృహోపకరణాలు కొని ఇళ్లలో వుంచుతున్నారు. వాళ్లు మంచి అందమైన గుఱ్ఱపుబళ్ల నెక్కి తిరుగుతున్నారు. వారిలో చాలామంది ఇంగ్లీషు ధారాళంగా మాట్లాడతారు. కొన్ని ముఖ్యమైన ఇంగ్లీషుగ్రంథాలనుకూడా చదివి వుంటారు. మాతో పరిచయం గల ఒక దేశీయుని పిల్లలు దొరలపిల్లలలాగ చిన్నకోటు, ఇజారు తొడుక్కొని, తలకు దొరటోపీ పెట్టి, కాళ్లకు మేజోళ్లూ, జోళ్లూ వేసుకోవడం నేను స్వయంగా చూశాను. బంగాళీభాషలో రెండుమూడు వార్తాపత్రిక లున్నాయి. అందులో ఇంగ్లాండులోని ఉదారరాజనీతిజ్ఞుల రాజకీయసిద్ధాంతాలను సమర్థిస్తూ వ్రాస్తూవుంటారు. కొద్దిరోజులకిందట ఈ దేశీయప్రముఖులలో ఒకరు స్పెయిను దేశంలోని విప్లవం జరిగినందుకు గౌరవార్థంగా ఒక విందు చేశారు. జనసామాన్యంలో కిందితరగతులలో కూడా మార్పులు కనబడుతున్నాయి. వారు తమ వర్ణాశ్రమధర్మాలపట్ల అశ్రద్ధ వహిస్తున్నారు. తమ పిల్లలను ఇంగ్లీషుపాఠశాలలకు పంపడానికి కుతూహలపడుతున్నారు. పాఠశాలలో బైబిలుబోధకు అభ్యంతరం చెప్పడంలేదు." (*Bishop Heber's Journal, p. 252*)

పాశ్చాత్యవ్యామోహం

గవర్నరుజనరలైన విలియంబెంటింకు 1829-వ సం.రం మేనెల 30-వ తేదీన తన మినిటులో ఇలాగ వ్రాశాడు:

"ఇప్పుడు కొత్త డబ్బుగలవారందరిలోనూ కేవలమూ ఐరోపాదేశాల వస్తువులయందు ఆసక్తి క్రమక్రమంగా హెచ్చుతూవున్నది. కొన్ని విషయా

లలో ఇది చాలా చిత్రంగా వున్నది. హిందువులకు చాలా పవిత్రమైన పండగలలోనూ, శుభకార్యాల లోనూకూడా కలకత్తాలో ఒక మార్పు వచ్చినదని విన్నాను. ఇదివరకు బిచ్చగాళ్లకూ, బ్రాహ్మలకూ పంచిపెట్టే సొమ్మును ఇప్పుడు దొరలకు ఆతిథ్యం యిచ్చేటందుకు ఖర్చు పెడుతున్నారు. అనవసరదాన ధర్మాలను తగ్గించివేస్తున్నారని వింటున్నాను."

హిందూదేశస్థితిగతులను గురించి కామన్సు సభలో జరిగిన విచారణలో 23-2-1832 తేదీన హోల్టు మెకంజీగారీవిధంగా సాక్ష్యం యిచ్చారు:

"పాశ్చాత్యులతో సంపర్కం కలగడంవల్ల దేశీయులలో మద్యపానము ఎక్కువ అయింది. ఇది నీతికి భంగకరమని విచారించవలసివున్నా దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం ఎక్కువ అయినందుకు సంతోషించాలి. దేశీయుల నౌకరులకు పూర్వంకన్న మంచి దుస్తులు వేస్తున్నారు. ఈబట్టలమీదకూడా పన్ను వున్నందువల్ల మన ఆదాయం వృద్ధి అవుతుంది. కలకత్తాలోని పరిస్థితులనుబట్టి చూస్తే దేశీయులలో ఇంగ్లీషు భోగవస్తువులను వుపయోగించడం ఎక్కువ అయినట్లు కనపడుతూవున్నది. వాళ్లు మంచి గృహోపకరణాలతో నింపిన ఇళ్లలో కాపురం వుంటున్నారు. చాలామంది గడియారములు ధరిస్తారు. సీమసారాయి తాగుతున్నట్లు కూడా తెలుస్తుంది."

24-3-1832 తేదీన బ్రాకెన్ గారు "కొనగల దేశీయులు చాలామంది యిప్పుడు సారాయి తాగుతున్నారు" అని అన్నారు. (*Colonization of India by Major B. D. Basu, p. 73.*)

నవనాగరికయువకులు

క్రైస్తవవిద్యావిధానంయొక్క మొదటి ఫలితం హిందూయువకులలో మతాచారాలపైన గౌరవం పోవడమే. ఒక పోర్చుగీసుదొరకును, దేశీయస్త్రీకిని పుట్టిన హెన్రీ లూయీ వివియన్ డిరోజియో అనే పేరు గల 17 ఏళ్ల యువకుడు 1826 లో కలకత్తా హిందూకాలేజీలో ఉపాధ్యాయుడైనాడు. అతడు చాలా తెలివైనవాడు. ఇంగ్లీషులో కవిత్వం చెప్ప గలడు. చాలామంది విద్యార్థులకు ఇతడు పరమగురువు. ఇతని నాయకత్వంకింద ఒక యువజనసంఘం బయలుదేరింది. వీళ్లకు మన దేశవేషభాషలపైన అభిమానం లేదు:మానసికంగా స్వేచ్ఛావిహారమే వీరి పరమలక్ష్యం. ఐరోపాలో చాలాకాలం కిందటనే వుద్భవించి మాటుమణగిన ఉద్యమాలు మళ్లీ యిక్కడ తలలెత్తినాయి. "స్వాతంత్ర్యం— సమానత్వం— సౌభ్రాతృత్వం—" అనే కేకలతో ప్రారంభమైన ఫ్రెంచివిప్లవభావాలూ, పద్ధెనిమిదో శతాబ్దంనాటి తత్వశాస్త్రజ్ఞులూ, షెల్లీ బైరను మొదలైన ఆంగ్లకవులూ అంటే వీరికి యిష్టం. మూఢవిశ్వాసాలను నిరసించడంలో వీళ్లు మొనగాళ్లు. ఇందులో చాలా మోటుగా ప్రవర్తించేవాళ్లు. సనాతనుల యిళ్లలో గొడ్డుమాంసం పడవేసేవారు. "మేము తురకల రొట్టె తిన్నామండోహోయ్" అని కేకలు వేస్తూ తిరిగేవారు. అల్లరికి తురకమతంలో కలిసినట్లు అభినయించేవాళ్లు. సంఘసంస్కారంవిషయంలో చాలా ముందుఅడుగు వేసేవారు. ఈపరిస్థితులలో అలెగ్జాండర్ డఫ్ అనే మిషనరీ విద్యాబోధనద్వారా క్రైస్తవమతప్రచారం చేసి కులీనబ్రాహ్మణకుటుంబాలలోని పిల్లవాళ్లనీ, గొప్పయింటిపిల్లలనూ క్రైస్తవమతంలో కలుపుకున్నాడంటే ఆశ్చర్యమేమున్నది? కులీనబ్రాహ్మణయువకుడైన కృష్ణమోహనబెనర్జీ 1832 లో క్రైస్తవమతంలో కలిశాడు. అలాగే ఇంకా కొందరు గౌరవకుటుంబాలవాళ్లు మతంలో కలిశారు.

హిందూకాలేజీలో గుమాస్తాగా వుండే హరమోహనచటర్జీ గారు ఈకాలేజీపిల్లవాళ్ల చర్యలను గురించి ఇలాగ వ్రాశారు: "హిందూమతధర్మాలనూ, ఆచారాలనూ బహిరంగంగానే తృణీకరించి ఖండించేవారు. నైతికవిషయాలనుగురించి తీవ్రమైన ఘర్షణలు జరిగేవి. హ్యూము అనే తత్వశాస్త్రజ్ఞుని అభిప్రాయాలు వ్యాపించాయి. డిబేటింగుసొసైటీ లనే వాగ్వాద సంఘాలు చాలా వెలిసినాయి. అందులో తీవ్రమైన వాగ్వాదాలు, మహోపన్యాసాలు జరిగేవి. హిందూమతము చాలా కలుషితమైనదనిన్నీ, పాపిష్ఠిదనిన్నీ, మానవమాత్రులు హర్షించతగినది కాదనిన్నీ నిరసించేవారు. హిందువులు నీచస్థితిలో పడివుండడాన్ని గురించి చాలా చర్చలు జరిగేవి. వీరి అజ్ఞానమూ, మూఢ

విశ్వాసాలే దీనికి కారణాలని నిర్ణయించేవారు. మంచి ఇంగ్లీషువిద్య వ్యాపింపచేయడం తప్ప ప్రజలను బాగుపరిచే మార్గం లేదని తీర్మానించేనారు. స్త్రీలు అజ్ఞానాంధకారంలో మునిగియుండడాన్ని గురించి సిగ్గుపడుతూ రోషావేశం ప్రదర్శించేవారు. హిందూ స్త్రీలకూ విద్యనేర్పాలని ఒక పెద్దసభలో తీర్మానించారు." (*Life and experiences of a Bengali chemist: Sir P. C. Ray. vol. ii, pp. 17-18.*)

బ్రహ్మసమాజం

వంగరాష్ట్రంలోని ప్రజలంతా క్రైస్తవులై పోతారా, ఈ హిందూసంఘము విచ్ఛిన్నమై నశిస్తుందా అనే అనుమానం చాలామందికి కలిగింది. ఇలాంటి సమయంలో దేవేంద్రనాథఠాకూరుగారు ప్రజలను రక్షించారు. రామమోహనరాయలవారు స్థాపించిన బ్రహ్మసభను ఉద్దీపింపజేసి హిందూమతంలో కనపడే కొన్ని లోపాలను సంస్కరించి క్రైస్తవ మతములోకి పోవనక్కరలేకుండానే అలాంటి సిద్ధాంతాలే మన పరిశుద్ధాస్తిక ఉపనిషన్మతంలో ఉన్నాయనే సంగతి చూపి దేశాన్ని సంరక్షించారు. బ్రహ్మసమాజం అభివృద్ధిచెందడంతో క్రైస్తవమతప్రచారం తగ్గింది. (*Rise and fulfilment of British Rule in India by Edward Thompson and G. T. Garratt, pp. 310-311*)

ఆంగ్లవిద్యాధికులు

కేశవచంద్రసేనుగారును, ఆయనజీవితచరిత్రను రచించిన ప్రతాపచంద్రమజుందారుగారును కాలేజీలో విద్య నభ్యసించి 1858 లో బయిటికి వచ్చేటప్పటికి వంగరాష్ట్రియువజనసంఘంయొక్క స్థితి చాలా శోచనీయంగా వుండేది. ఇంగ్లీషుగ్రంథాలను కొన్నింటిని గుడ్డిగా చదవడంమూలంగా కొంత భాషాజ్ఞానం సంపాదించడమే విద్యనేర్వడమని ఆకాలంలో అనుకునేవారు. ఎవరైనా ఒక పత్రికలో వ్యాసం వ్రాశాడంటే వాడిని ఆచుట్టుపట్లకల్లా చాలా గొప్పవాడనుకునేవారు. రాజకీయప్రజాజీవన మనేది లేదు. ఆకాలంలో కలకత్తాలో లిటరరీక్లబ్బు లనే భాషాభివృద్ధిసంఘాలు చాలా బయలుదేరినాయి. అందులో ఎవరైనా ఇంటిదగ్గర తయారుచేసుకొనివచ్చి ఒక ఉపన్యాసం యిచ్చాడంటే అతడు చాలా గొప్పరాజకీయవేత్త అనుకునేవారు. కేవలమూ పరమార్థచింతతోగాక తన యిష్టంవచ్చినవాళ్లతో కలిసి ఇష్టంవచ్చిన పదార్థాలను తినవచ్చు ననే వూహతో ఎవరో ఒకరు బ్రహ్మసమాజంలో చేరుతూవుండేవారు. అప్పుడప్పుడొక యువకుడు క్రైస్తవమతంలో కలిసేవాడు. అంతేగాని ఆకాలంనాటి చదువులు నిజంగా మనుష్యుల మనస్సులనుగాని, అంతరంగాలనుగాని ఉద్దీపింపజేయలేదు. అయితే పాశ్చాత్యవిజ్ఞానం వృద్ధిచెందినందువల్ల కలిగిన ఫలితం ఏమిటంటే, చదువుకున్నవాళ్లలో ఐహికసుఖాసక్తి ఎక్కువ అవడమే. యువకులలో అపనమ్మకము వర్ధిల్లి నీతి క్షీణించింది. పాశ్చాత్యవిద్యను ప్రజలలో వ్యాపింపచేయడానికి ప్రభుత్వంవారు నిశ్చయించినందుకు ఫలితంగా దేశభాషలకు ఆదరణ తగ్గిపోయింది. కొద్దికాలంకిందటివరకూ గౌరవింపబడుతూ వుండిన సంస్కృతము, అరబ్బీ, పారసీభాషలు పనికిమాలిన మొరటుభాషలుగా పరిగణింపబడి ఇంగ్లీషుకు గౌరవం వచ్చింది. 1851 లో స్థాపింపబడిన బెథూన్ సొసైటీ వంటి డిబేటింగు సొసైటీలు కలకత్తాలో చాలాచోట్ల స్థాపించారు. అవి విద్యార్థులలో కదలిక పుట్టించాయి. ఇలాంటి సభలలో వాగ్వాదాలలో నుండే రాజకీయపరిజ్ఞానం ఉద్భవించింది. ఒకటిరెండు ఇంగ్లీషు వార్తాపత్రికలు తలలెత్తాయి. వంగభాషలో చాలా వార్తాపత్రికలు బయలుదేరి ఒకదాని నొకటి తిట్టుకుంటూవుండేవి.

మద్యమాంసాలు, వ్యభిచారం

సనాతనధర్మంపైన నమ్మకం పోయిన యువకులు గుంపులుగా చేరి మతాలనుగురించి చర్చిస్తూ తమతోడి హిందువులలో పెద్దల మూఢవిశ్వాసాలను, ఆచారాలను అప్పుడప్పుడు విమర్శిస్తూ దూషిస్తూ వుండేవారు. ఇవన్నీ దేశీయజనసంఘంలో కల్లోలం కలిగించాయి. యువకులు నీతి నియమా లన్నీ ఉల్లంఘించి ఎలాంటి హద్దూ పద్దూ లేక తమ యిష్టం వచ్చినట్లు తిని తాగి యథేచ్ఛగా జీవించడానికి ప్రయత్నించారు.

క్రైస్తవ మిషనరీలూ, కుంపినీ అధికారులూ, యువకు లైన పత్రికారచయితలూ, పరిపక్వం చెందని సంస్కర్తలూ కలిసి వర్ణాశ్రమధర్మాలపైన కత్తికట్టారు. కాలేజీలలో చదివే విద్యార్థిసంఘమంతా వారి కిందులో తోడయ్యారు. పాశ్చాత్య భోగ వస్తువులనూ, మద్య మాంసాలనూ స్వీకరించడమూ, దొరల జీవితపద్ధతులను అనుకరించడమూ, బ్రాహ్మణపురోహితుల ఆంక్షలను, బంధువుల మాటలను తృణీకరించడమూ దాని ఫలితాలు. చదువుకున్న వారిలో మద్యపానమూ ఎక్కువ అయింది. దానితోపాటు ఇతరదుర్వ్యసనాలు, అందు వల్ల అకాలమరణాలు వృద్ధిజెందినాయి. స్త్రీలకు స్వాతంత్ర్య మివ్వాలనే ప్రచారం సాగింది. అక్కడక్కడ ఘోషా వదిలించి కొందరు స్త్రీలను బహిరంగంగా సభ్యులలోనికి రానిచ్చారు. స్త్రీలను గౌరవించేపద్ధతిని నేర్చుకోవడానికి పూర్వమే ఇరుగు పొరుగువారి స్త్రీలతో పరిచయం చేసుకోవడానికి ప్రయత్నించారు. చదువుకున్న వారిలో నీతినియమాలు లేక వ్యభిచారం మితిమీరినది. నాస్తికులు, శుష్కవేదాంతులు, నీతిమతబాహ్యులు, మెటీరిలియజం, పాజిటివిజం అనే పాశ్చాత్యసిద్ధాంతాలవారు మొదలైన వితండవాదులు దేశంలో విజృంభించారు. క్రైస్తవమతంలో కలియడానికిగాని, బ్రహ్మసమాజంలో చేరడానికిగాని ఒకడు వస్తే పదిమంది నాస్తికత్వాన్ని అవలంబించేవారు బయలుదేరారు. పాశ్చాత్య దేశాలవారి పద్ధతుల త్రాగుబోతుతనము, వ్యభిచారము హిందువుల పండుగలలోకీ, ఉత్సవాలలోకీ, శుభకార్యాలలోకీకూడా వచ్చి వెలిశాయి. అలాంటి సమయాలలో ఇంగ్లీషువర్తకులూ, ఉద్యోగులూ దేశవాళీభోగం వాళ్ల మేజువాణీలకు హాజరయ్యేవారు. నీతినియమాలపైనా, మతంపైనా నానాటికీ విశ్వాసం తగ్గిపోవడం ప్రారంభించింది. కలగాపులగపు నాగరికత దాని లాభనష్టాలతో దాపురించింది. గొప్పవాళ్ల మనుకునేవారందరూ అనుసరిస్తూ వున్న ఈ దుర్మార్గపు పద్ధతులకు హద్దూ పద్దూ లేకుండా పోయింది. క్రైస్తవమతబోధకులుగాని, ఆమతంలో కలిసినవారుగాని ఈ అవినీతికరమైన పద్ధతులను నిరసించడానికి ప్రయత్నించలేదు. ఆకాలంలో అలెగ్జాండర్ డఫ్ గారి విద్యార్థులున్నూ, ఇతరయువకులున్నూ పందిమాంసపు గుట్టలను ఛేదించుకుంటూ సారాయపుమడుగులనుండి యీదుతూ తమ ఉన్నతగమ్యస్థానానికి పోతున్నా రని ఒక పత్రిక వ్రాసింది. కృష్ణమోహనబెనర్జీ గారు ప్రకటించే 'ఇంక్వైరర్' పత్రికాకార్యాలయంలో చేరిన యువకులు కొందరు ఆపక్క కాపురంవున్న సనాతనుని యింట్లో గొడ్డుమాంసం పడవేయగా దెబ్బలాట జరిగిం దనే సంగతి అలెగ్జాండరు డఫ్ గారి జీవితచరిత్రలో వ్రాయబడివున్నది. (*Life of Alexander Duff by George Smith; Keshubchandrasen and his times by Pratapchander Muzoomdar*)

ఆంగ్లమానసపుత్రులు

ఇంగ్లీషువిద్య ఆరంభమైన పాతికసంవత్సరాలలోపుగానే మెకాలే చెప్పిన జోస్యం నిజమైంది. రంగులోనూ, రక్తంలోనూ, భారతీయులుగా వున్నా రుచులలోనూ, అభిప్రాయాలలోనూ, మనోభావాలలోనూ ఆంగ్లేయులుగా వుండే ఆంగ్లమానసపుత్రుల తరగతి యొకటి వంగరాష్ట్రంలోనేకాక భారతదేశమంతటా వుద్భవించింది. వంగరాష్ట్రంలో మొట్టమొదట సీమకు వెళ్లి బ్యారిష్టరై వచ్చిన ఆయన కలకత్తాలో ప్రాక్టీసు ప్రారంభించడానికి ధనవంతులు, నాగరికులు, దొరలూ వుండే చౌరింఘీపరిసరాలలోనే ఇల్లు కుదుర్చుకున్నాడు. ఆయింటిని ఇంగ్లీషుబల్లలు, బెంచీలు మొదలైన సీమవస్తువులతో అలంకరించాడు. తాను తన ఆంగ్లప్రభువుల దుస్తులు వేసుకొని వాళ్ల ఆచారాలు అవలంబించాడు. అతనితర్వాత వచ్చిన యువకు లంతా అతనిని అనుకరించారు. తెలివైన హైకోర్టువకీళ్లు ఇవాళ చేసే పనిని మర్నాడు ప్రజ లంతా అనుకరిస్తారు. ఈ నవనాగరికులను సామాన్య ప్రజలు అనుకరించారు. న్యాయాధిపతి, న్యాయవాది, వైద్యుడు, బడిపంతులు, గుమాస్తా-వీరంతా విద్యాధికుల తరగతివారు. వీరందరూ రైతుపండించే పంటపైన బ్రదికేవాళ్లే. వీళ్లెవరూ దేశసంపదను ఉత్పత్తి చేసేవాళ్లు కారు. అందరూ సొమ్ము ఖర్చుపెట్టేవాళ్లే. వీళ్లు పాశ్చాత్యుల బాహ్యవేషభాషలను, జీవితాన్ని అనుకరించారేకాని వారి పూనిక, ధైర్యము, కార్య

నిర్వాహకత్వము, ఇంకా జాతియొక్క గొప్పదనానికి తోడ్పడే ఇతరగుణాలూ వీళ్లు నేర్చుకోలేదు. ఈ నవనాగరికులు బాహ్యవేషభాషలలో ఇలాగ జాతి వారిని అనుకరించినా ఇళ్లలోమాత్రం పూర్వాచారాలకు దాసులుగా వుండేవారు.

'దేశదౌర్భాగ్యం'

ఇలాగ పాశ్చాత్యవేషభాషలను, నాగరికతను అనుకరించడం ఒక గొప్ప కాకపోవడం అలా వుండగా ఇది చాలా అధఃపతనమనే చెప్పాలి. ఈదేశశీతోష్ణాలనుబట్టి మనకు తగిన పంచ, చొక్కా, ఉత్తరీయాలను వదలి పైనుండి కిందిదాకా బిగించుకునే సూటు బూటులు ఆరోగ్యానికి భంగకరాలనే సంగతి కూడా వీరు గమనించలేదు. ఇలాగే ఆహారవిహారపానీయాలలోనూ పాశ్చాత్యులను అనుకరించి టీ తాగడమూ, సిగరెట్టులను కాల్చడమూ మనకు పనికిరావని గమనించలేదు. తగినా తగకపోయినా ధనవంతులైన పాశ్చాత్యుల పద్ధతులు మన బీదదేశానికి ఎంతమాత్రమూ తగవనే సంగతిన్నీ గమనించలేదు. ఈపద్ధతులు అమిత ధనవ్యయానికి కారణాలై చాలామంది నాశనమయ్యారు. వీళ్ల పద్ధతులవల్ల దేశీయవస్తువుల ధరలు పెరగడమేకాక విదేశీయవస్తువుల ఉపయోగము ఎక్కువ అయింది. దుస్తులకు, జోళ్లకు, ఇతరవస్తువులకే కాక కొత్తరుచులనుబట్టి బంతిఆటలకు, బిలియర్డ్సు ఆటకు చాలా ఖర్చు అవుతుంది. సినీమాలు, సర్కసులు కూడా వ్యయానికి కారణాలైనాయి.

ఎర్రయిండియనులు, జూలూలు మొదలైన అనాగరికజాతులవాళ్లలాగనే మనవాళ్లు ఈవిదేశవస్తువుల వ్యామోహంలో పడ్డారుగాని మన దేశంలో దొరికే ముడిసరుకులతో ఈభోగవస్తువులను తయారు చేసుకోలేని అసహాయస్థితిలోనే పడివున్నారు. బస్తీలలో వుండే గొప్పవారిని చూసి మనగ్రామస్థులుకూడా ఈభోగద్రవ్యాలను ఉపయోగించి నాశనంకావడం ప్రారంభమైనది. తినడానికి తిండీ, కట్టుకోవడానికి బట్టా లేకపోయినాసరేకాని ఈభోగద్రవ్యాలూ, విదేశీ దుస్తులూ లేకపోతే బ్రతుకలేమనేటంత పిచ్చిలో పడ్డారు ప్రజలు. జీవనానికి అవసరాలైన వస్తువులను వెనక్కి తోసి ఉబుసుపోకకూ, భోగానికీ, భోగం అని అనుకునే అనుకరణాలకూ కావలసిన వస్తువులకు అక్కర ఎక్కువఅయింది.

ఈపిచ్చి యిప్పటికీ వృద్ధి అవుతూనేఉన్నది. ఇరవై ఏళ్లకిందట కని విని ఎరుగని కొత్తవస్తువులు పుట్టినప్పటినుండీ మనకు వున్నట్లూ, అవి లేకపోతే బతకలేనట్లూ అనుకునేటంత అలవాటు అయి అవసరములైనాయి. మోటారులు, గ్రామోఫోనులు, సినీమాలు, ఫోటో కెమెరాలు మొదలయినవాటి సంగతి చూడండి. ప్రజలకు వోటుహక్కులు గల ప్రజాసంస్థలను స్థాపించిన ఆంగ్లనాగరికత ప్రభావంవల్ల సమస్తభోగాలూ తాముకూడా అనుభవించాలనే భావం జనసామాన్యంలో వృద్ధిఅయింది. దీనికి తోడు యుద్ధాలు వచ్చి, ప్రజలలో బాధ్యత, పొదుపు, వుండాలనే భావాన్ని క్షీణింపచేసి ఐహికసౌఖ్యానుభూతినే జీవితపరమావధిగా చేశాయి. ఈవిషయంలో ఆసియా, ఆఫ్రికా దేశాలు అమెరికా, ఐరోపాఖండాల దారినే పట్టినాయి. అని ఆచార్య ప్రఫుల్లచంద్రరాయిగారు వ్రాశారు. (*Life and experiences of a Bengali Chemist: Sir P. C. Ray. Vol. II. pp. 340–41*)
